ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు



శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



లక్ష్య సాధనకు 45 రోజులే

- సమీపిస్తున్న ఆర్థిక సంవత్సరం
- టార్గెట్ చేరేందుకు మిగిలింది నెలన్నరే
- ఉత్పత్తి కోసం శ్రమిస్తున్న సింగరేణి ఉద్యోగులు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అధికారులు
- ఎండీటీ సమావేశాలు ఫలించేనా ?

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 15: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే గడువు సమీపిస్తోంది. మార్చి 31తో వార్షిక లక్ష్యం చేరుకొనేందుకు ఇంకా 45 రోజులే మిగిలింది. దీంతో రోజు అధికారులు ఉత్పత్తిని పర్యవేక్షిస్తుండగా, లక్ష్యం దిశగా ఏరియా కార్మికులు శ్రమిస్తున్నారు.

సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులు కాగా, గురువారం వరకు 59.35 మిలియన్ టన్నులు సాధించింది. ఇంకా సుమారు 10.65 మిలియన్ టన్నులు సాధించాల్సి ఉంది. ఇక శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించిన లక్ష్యం 66.40 లక్షల టన్నులు. గురువారం వరకు ఈ నిర్దేశిత లక్ష్యంలో 49.38 లక్షల టన్నులు సాధించారు. మిగిలిన రోజుల్లో లక్ష్యాన్ని చేరుకోవడానికినిత్యం 37 వేల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ రోజు 20 వేల టన్నుల ఉత్పత్తి దాటే పరిస్థితి కనిపించడం లేదు.

లక్ష్యం సాధించేనా ?

ఈ ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, అనుకున్న మేరకు ఉత్పత్తిని సాధించలేకపోతున్నామని గ్రహించిన సీఎండీ బలరాం ప్రత్యేక సమావేశాలకు శ్రీకారం చుట్టారు. కరోనాకు ముందు నాలుగేళ్ల క్రితం మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాలు ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించగా, మళ్లీ అదే పంథాను కొనసాగించేందుకు ఈ సారి కూడా అదే మాదిరిగా అన్ని విభాగాల అధికారులు, యూనియన్ నాయకులతో కలిసి మల్టీడిపార్ట్‌మెంటల్ (ఎండీటీ) సమావేశాలు నిర్వహించారు. ఇవి ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కొనసాగాయి.

ఇందులో భాగంగా రోజుకు ఒక గనిపై సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచడం, ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం, నాణ్యతా ప్రమాణాలు పెంచడం, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. సమావేశాలకు ఎస్ఓటు జీఎం కన్వీనర్‌గా రక్షణ, ఈ అండ్ఎం, ఫైనాన్స్, పర్సనల్, ఐఈడీ, క్వాలిటీ తదితర ఉన్నతాధికారులు సభ్యులుగా వ్యవహరించారు. ప్రతీ గనిని సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించారు. ఒక్కో కార్మికుడు ఉత్పత్తికి ఏ మేరకు సహకరించాలి, యంత్రాలను ఏ మేరకు వినియోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.

ఇందులో భాగంగానే ఈ నెల 8న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) సీసీసీలోని సింగరేణి విశ్రాంతి గృహంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాను సమక్షించి, మిగిలిన లక్ష్యాన్ని చేరుకునేందుకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఇతర డైరెక్టర్లు సైతం ఏరియాలో పర్యటించి ఉత్పత్తిని పరిశీలించారు. సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఉద్యోగులు నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అధికారులు సైతం నిత్యం పర్యవేక్షిస్తూ టార్గెట్‌ను చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి కృషి ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

ఏరియాలో(గురువారం) నాటికి లక్ష్యం, చేరుకున్న ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)

గని పేరు	లక్ష్యం	సాధించింది
ఆర్కె 5	2.70	2.45
ఆర్కె 6	1.80	1.71
ఆర్కె 7	3.60	2.93
ఆర్కె న్యూటెక్	1.60	1.40
ఎస్ఆర్‌పి 1	1.50	1.00
ఎస్ఆర్‌పి 3, 3ఎ	2.80	2.03
ఇందారం 1ఎ	2.40	1.70
శ్రీరాంపూర్ ఓసీపీ	35	25
ఇందారం ఓసీపీ	15	11

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15: మంచిర్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా గురువయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

నస్పూర్ మున్సిపల్ కమిషనర్...



కమిషనర్ సతీష్

నస్పూర్, ఫిబ్రవరి 15: మున్సిపాలిటీ కమిషనర్‌గా సీహెచ్ సతీష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అమంగల్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్న సీహెచ్ సతీష్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ సుర్మిళ్ళ వేణులు కలిశారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



ఎం.దేవేందర్‌రెడ్డి

నెన్నెల, ఫిబ్రవరి 15: మండల అభివృద్ధి అధికారిగా ఎం.దేవేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. నిర్మల్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా సేవలందించిన వరలక్ష్మి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి బదిలీపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో పేర్కొన్నారు.

కోటపల్లి: కోటపల్లి ఎంపీడీవోగా ఆకుల భూమన్న బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీవో భాస్కర్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ కాగా తాంసి ఎంపీడీవో ఆకుల భూమన్న బదిలీపై కోటపల్లికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సిబ్బంది సన్మానించారు.

ఎంపీడీవోకు సన్మానం

చెన్నూరు, ఫిబ్రవరి 15: చెన్నూరు ఎంపీడీవో శ్రీనివాస్ ఆసిఫాబాద్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు జ్ఞాపికను అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీవో అజ్మత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తాండూర్: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్రాన్‌ఖాన్‌ను తహసీల్దార్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి మోమిన్ ఆలీ, నాయకులు ఇందూరి గట్టయ్యదుర్గం మహేందర్,నగేష్, దుర్గయ్య, అఖిల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

- మైన్స్ ఏరియాను ముట్టడించిన గత్రావుపల్లి ప్రజలు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలని డిమాండ్



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్, హాజరైన స్థానికులు

కాసిపేట, ఫిబ్రవరి 15: మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఆందోళనలు, నిరసనల మధ్య ముగిసింది. ఓరియంట్ సిమెంట్ కంపెనీ నాలుగో ప్లాంటు విస్తరణలో భాగంగా ముడి సరుకు కోసం 588.26 హెక్టార్ల సున్నపురాయి గనుల లీజు కోసం టీఎస్ఎండీసీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి లక్ష్మీప్రసాద్ హాజరయ్యారు. ఓరియంట్ కంపెనీ నాలుగు దశాబ్దాల్లో నాలుగు ప్లాంట్లకు విస్తరించిందని, స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద కంపెనీ ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో కంపెనీ నిర్లక్ష్యం వహించిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైన్స్ లీజు కోసం అందరు అంగీకారం తెలుపుతూనే స్థానిక యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే గేటు సమీపంలోని కొన్ని గూడాల్లో కలుషిత నీరు తాగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. విద్య, వైద్యం, అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. సీఎస్ఆర్ నిధులను ఓరియంట్ ప్రభావిత గ్రామాల్లో ఖర్చు చేసి దుమ్ముధూళి వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికేతర పిల్లలకు డీఏవీ పాఠశాలలో ఉచితంగా విద్యనందించాలని, అలాగే జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. 24 గంటలు ఓరియంట్ డిస్పెన్సరీలో వైద్య సేవలందించాలని, ఓరియంట్ ప్రభావిత గ్రామాల్లో అంబులెన్స్‌ల సౌకర్యం కల్పించాలని కోరారు. మందమర్రి నుంచి ఓరియంట్ సిమెంట్ కంపెనీకు వచ్చే రైల్వే ట్రాక్‌లో భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మూడెకరాల సాగు భూమి కోల్పోయి దినసరి కూలీగా పనిచేస్తున్నానని చింతగూడెం చెందిన మడావి గోపాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. భూములు ఇచ్చి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైల్వేలైన్‌లో భూములు కోల్పోయిన వారందరికి కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు ధిక్కరించారన్నారు. భూనిర్వాసితులకు, స్థానికులకు కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల కోసం వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో విన్నవించిన సమస్యలను రాత పూర్వకంగా తెలియజేయా లని సూచించారు. ఓరియంట్ కంపెనీ యాజ మాన్యంతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మైన్స్‌ను ముట్టడించిన ప్రజలు

2018లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలను ఓరియంట్ కంపెనీ నెరవేర్చక పోవడాన్ని నిరసిస్తూ గత్రావుపల్లి గ్రామ పంచాయ తీ ప్రజలు మైన్స్ ఏరియాను ముట్టడించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఓరియంట్ మైన్స్‌లో పేలే బత్తి దెబ్బలకు ఇండ్లు బీటలు వారడంతోపాటు కా లుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ విషయాలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తుడుంగూడెం, ఇప్పలగూడెం, రేగులగూడెం, గత్రావుపల్లి, సాలెగూడెం, గోండుగూడకు చెందిన సుమారు 200 మంది ప్రజలు మైన్స్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ రవికుమార్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఓరియంట్ కంపెనీ స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో ఓరియంట్ కంపెనీ యాజమాన్యం, ఆదివాసీ సంఘాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ భోజన్న, ఓరియంట్ కంపెనీ అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15: వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, భూకమతాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని, జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడంలో క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మండల విస్తరణ అధికారులు వారి పరిధిలో భూకమతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వ్యవసాయ రంగంలో రైతులకు తగిన మెలకువలు అందించాలని, నకిలీ విత్తనాల నియంత్రణపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు, ఫర్టిలైజర్ షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, స్టాక్ నిల్వల రిజిష్టర్‌లు, నిల్వలను పరిశీలించాలని, పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, నిర్వహణ సక్రమంగా లేకపోయినా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సస్పెండ్ చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన, మండల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బదిలీల్లో భాగంగా జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన అధికారులు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులు, ఉద్యోగులు విధుల్లో నిబద్ధత కలిగి ఉండాలని, ప్రజలతో జవాబుదారితనంగా వ్యవహరించాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే ఆర్జీదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, స్వీకరించిన ఆర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15: పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. గురువారం విద్యాశాఖ అధికారులు, పంచాయతీ, మున్సిపల్ అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అద నపు కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందుండే విధంగా కృషి చేయాల న్నారు. జిల్లాలోని పంక్షన్ హాల్‌లు, రైతువేదికల్లో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యా ర్థుల్లో దాగి ఉన్న భయం, అపోహలను తొలగించి పరీక్ష లకు సన్నద్ధమయ్యే విధంగా నిపుణుల ద్వారా చైతన్య పరి చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అవగాహన తరగతులలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 1 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయని, ఇందుకు అందరూ సిద్ధం గా ఉండాలని తెలిపారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

చెన్నూరు: గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం చెన్నూరు శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో ఏమైనా సమస్యలున్నాయా అని పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మైదం రవి, సుశీల్‌కుమార్‌లు అదనపు కలెక్టర్‌ను కలిసి గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కేజీబీవీని సందర్శించిన తహసీల్దార్

తాండూర్, ఫిబ్రవరి 15: తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినీలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం వంట గదిలో వంట సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

విటమిన్ ఏ లోపం లేకుండా చూడాలి



అంగన్‌వాడీ కేంద్రంలో విటమిన్‌ఏ ద్రావణం తాగిస్తున్న సీహెచ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15: పిల్లల్లో కంటి చూపు లోపం లేకుండా చేసేందుకు ప్రభుత్వం విటమిన్ ఏ కార్యక్రమాన్ని చేపట్టిందని సీహెచ్‌వో రామమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విటమిన్ ఏ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ విటమిన్ ఏ ద్రావణం తాగించడం వల్ల భవిష్యత్‌లో పిల్లలకు రేచీకటి రాకుండా ఉంటుందన్నారు. రోగ నిరోధక శక్తి మెరుగు పడడానికి, చర్మ ఆరోగ్యానికి విటమిన్ ఏ దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు అరుణ, జ్యోతి, ఏఎన్ఎంలు విజయలక్ష్మీ, దివ్య , తల్లులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు, ఎంపీడీవోకు సన్మానం

హాజీపూర్, ఫిబ్రవరి 15: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మందపల్లి స్వర్ణలతశ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవిలు సర్పంచులకు వీడ్కోలు సభ నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హైను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మాట్లాడుతూ ఎంపీడీవో పదవి కాలంలో మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేశారని తెలిపారు. ఎంపీడీవో మధుసూదన్, మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, పశు వైద్యురాలు సరిత, ఏపీవో మల్లయ్య, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మీ, మిషన్ భగీరథ ఏఈ గిరిజ, ఎంపీటీసీలు జాడి వెంకటేష్, బాలరాజు, సుజాత, అనుబాయి, రఫీక్, నయీంపాషా పాల్గొన్నారు.

21లోగా ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించాలి

దండేపల్లి, ఫిబ్రవరి 15: ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన అభ్యాసకులు టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజును ఈనెల 21లోగా చెల్లించాలని ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ సమన్వయకర్త బీసగాని శంకర్‌గౌడ్, సహాయ సమన్వయకర్త సంగర్స్ రాజేశ్వర్‌రావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది అనుతీర్ణులైన అభ్యాసకులు, పరీక్షలు రాయలేని వారు అడ్మిషన్ నెంబర్ ద్వారా మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో ఫీజు చెల్లించాలన్నారు. 8309769067, 9866110308 సంప్రదించాలన్నారు.

పంటల మద్దతు ధరలు పెంచాలి



పత్తి రైతులతో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల, ఫిబ్రవరి 15: పంటలకు మద్దతు ధరలు పెంచాలని అఖిల భారత రైతుకూలి సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతులతో మాట్లాడారు. పెట్టుబడి 50 శాతం పెంచి పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఇళ్లల్లోని పత్తి నిల్వలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సీసీఐ ద్వారా పత్తి క్వింటాలుకు రూ. 6920 చెల్లిస్తున్నారని, ఆ ధరతో పత్తి అమ్ముకుంటే రైతులకు పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. వరి పంటకు బోనస్ చెల్లించాలన్నారు. వేసవిలో ఉపాధిహామీ కూలీలకు పని కల్పించాలన్నారు. శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాగర్, శంకర్, పెద్ద లస్మయ్య, దుర్గం మల్లేష్, జాడి సత్తయ్య తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 15: బెల్లంపల్లిలోని బంగారు మైసమ్మ ఆలయం నుంచి నేషనల్ హైవేపై ఓవర్ బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రాములునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకటిగా ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు కాలినడకన వెళ్తుండగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నేషనల్‌హైవే అథారిటీ అధికారులు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

జాబ్ మేళా

ఏసీసీ, ఫిబ్రవరి 15: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 17న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కౌశిక్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో బ్రాంచ్ మేనేజర్, రిలేషన్ షిప్ ఆఫీసర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగాలు కల్పించబడతాయన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ చదివిన వారు అర్హులని, ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 9963452486లో సంప్రదించాలన్నారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ల విడుదల



జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్

భీమారం, ఫిబ్రవరి 15: గాంధారి మైసమ్మ జాతర పోస్టర్లను గురువారం తహసీల్దార్ సదానందం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 23న గోదావరి జలాల సేకరణ, 24న సదర్ భీమన్న, పోచమ్మ తల్లికి పూజలు, మైసమ్మ తల్లికి పెద్దపట్నం, 25న జాతర, దర్బార్ జరుగుతుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో జాతరలో పాల్గొనాలన్నారు. నాయబ్ తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ స్రవంతి, నాయకపోడు ఆలయ కమిటీ డైరెక్టర్ లైనేని మహేష్, నాయకపోడు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవి, నాయకులు శ్రీనివాస్, లచ్చయ్య, కుమార్,చంద్రయ్య, శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య యాత్ర కరపత్రాల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15: జిల్లాలో మార్చి 3వ తేదీ నుంచి చేపట్టే బీసీ చైతన్య యాత్ర కరపత్రాలను గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ ఐక్యవేదిక నాయకులు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ యాత్ర మంచిర్యాలలోని అమరవీరుల స్థూపం నుంచి ప్రారంభమవుతుందన్నారు. బీసీ ఐక్యవేదిక కన్వీ నర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు కనుకుంట్ల మల్లయ్య, చంద్రమౌళి, రాజన్న, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జన్నారం, ఫిబ్రవరి 15: జన్నారంలోని ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయ సంచాలకులు సురేఖ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులను ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు. స్టాక్ రిజిష్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

అంతర్గత మూల్యాంకనం పరిశీలన

దండేపల్లి, ఫిబ్రవరి 15: తాళ్ళపేట, గుడిరేవు, దండేపల్లి, రెబ్బనపల్లి, కోర్విచెల్మ పాఠశాలల్లో గురువారం పదో తరగతి నిర్మాణాత్మక పరీక్షల అంతర్గత మూల్యాంకన మార్కుల వివరాలపై జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. మార్కుల వివరాలు, ఆన్‌లైన్ నమోదు పరిశీలించారు. చిన్నయ్య, శంకర్‌గౌడ్, రాజన్న, రూపాచారి కొండయ్య, పాల్గొన్నారు.

వీఏసీసీ లోగో ఆవిష్కరణ

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 15: విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ (వీఏసీసీ) లోగోను గురువారం ఆవిష్కరించారు. కౌన్సిల్ చైర్మన్ డా. రాజలింగు మోతె మాట్లాడుతూ అవినీతి, సాంఘిక దురాచారాలను నిర్మూలించడమే లక్ష్యంగా కౌన్సిల్ పని చేస్తుందన్నారు. పోలీసు, మీడియా, ప్రజలకు ఉమ్మడి వేదికగా కౌన్సిల్ పనిచేస్తుందన్నారు. దుర్గం వెంకటేష్, మోతె రవి, వేల్పుల మల్లేష్, శ్రీనివాస్, బాబు, అశోక్ పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ బిల్లును ఆమోదిస్తాం

సిర్పూర్(టి), ఫిబ్రవరి 15: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే స్వామినాధన్ కమిషన్ బిల్లును ఆమోదిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు షకీల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం స్వామినాథ కమిషన్ బిల్లును వ్యతిరేకి స్తోందని, కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. నాయకులు తిరుపతి, ఇనాయత్ అలీ తదితరులు ఉన్నారు.

నేటి దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 15: జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు తమ నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు సమ్మెలో పాల్గొనాలన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సీసీసీలోని నర్సయ్య భవన్ నుంచి ర్యాలీ ప్రారంభించి, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్దకు చేరుకుంటామని, అక్కడ ధర్నా చేపడతామని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, మండల అధ్యక్షుడు జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ నాయకులు దాసు, వీరభద్రయ్య, చంద్రశేఖర్, కొమురయ్య, సారయ్య, నవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.

వేమనపల్లి: దేశ వ్యాప్త సమ్మెలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొనాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపుయాదవ్ పేర్కొన్నారు. సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పర్మినెంటు చేయడం లేదన్నారు. సమ్మెలో భాగంగా హైద్రాబాద్ కోటిలోని డీహెచ్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 1.30 గంటలకు నిరసనను విజయవంతం చేయాలన్నారు. మండల కార్యదర్శి అందె పురుషోత్తం, చిన్న శంకర్, తోకల హన్మంతు, మల్లేష్ పాల్గొన్నారు.

నెన్నెల: దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌కు ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం మైలారంలో సంఘం రాష్ట్ర నాయకులు మనోహర్ మాట్లాడారు. డిమాండ్ల సాధనకు ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళనపై టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని ఖండించారు. కేంద్రం లో బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధా నాలను ప్రతిఘటించాలని పిలుపుని చ్చారు. భాస్కర్, వంశీ, మహేష్, భూమేష్, సాయిలు, అశోక్ పాల్గొన్నారు.

భీమిని: దేశవ్యాప్త సమ్మెకు ఐకేపీ వీఏఓల సంఘం సమ్మెలో పాల్గొంటామని వారికి మద్దతుగా గురువారం ఐకేపీ ఏపీఎం ప్రకాష్ గౌడ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. వీఏఓ గౌరవ అధ్యక్షులు ముక్తేశ్వర్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మొండన్న, కోషాధికారి కామెర మల్లేష్, వీఏఓలు ధర్మయ్య, రజిత, సాగరిక, అనూష, భాస్కర్, పుష్పలత, సౌజన్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

కోటపల్లి, ఫిబ్రవరి 15:సర్వాయిపేటలో గురువారం సేవాలాల్ జయంతి వేడుకలను బంజరా కులస్తులు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కాకతీయకాలనీలో భక్తిశ్రద్ధలతో బోగిబండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. లంబాడి జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు తేజావత్ రాంబాబునాయక్ మాట్లాడుతూ గిరిజన లంబాడీలు మెరుగైన వ్యవసాయ విధానం నేర్చుకొని సుస్థిరజీవనాన్ని గడపాలన్నారు. ఐక్యంగాఉండి సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రామారావు, సీతారాంనాయక్, తేజావత్ రామకృష్ణ నాయక్, దామోదర్ నాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

భీమిని, ఫిబ్రవరి 15 : గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ గంగ మోహన్ సూచించారు. గురువారం కార్యాలయంలో సిబ్బందితో, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నర్సరీల్లో వంద శాతం బెడ్లు ఏర్పాటు చేసి విత్తనాలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.. అనంతరం బదిలీ పై వెళ్లిన ఎంపీడీఓ జవహర్‌లాల్‌ను సన్మానించారు. ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ గంగక్క, ఎంపీఓ సఫ్దార్ అలీ, ఏపీఓ భాస్కర్ రావు, ఈసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమిని: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తహసీల్దార్ బికర్ణ దాస్ అన్నారు. మల్లీడి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పారిశుధ్య కార్మికులసేవలు లేకపోతే ప్రజలఆరోగ్యం కుంటుపడుతుందన్నారు. ఎంపీడీఓ గంగ మోహన్, ఎంపీఓ సఫ్దార్ అలీ, ఆరై వెంకటేష్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన పెంపొందించేలా పర్యావరణ పరిరక్షణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 24 వరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కరెస్పాండెంట్‌లు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు పాఠశాలల్లో మోడల్ జెడ్పీ సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. సలహాలు, సూచనల కోసం జిల్లా గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ యోగేశ్వర్ 9849254747లో సంప్రదించాలని తెలిపారు. సమావేశం తీర్మానం ప్రతిని జిల్లా గ్రీన్ కోర్ కోఆర్డినేటర్‌కు పంపించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చే పాఠశాలలకు అవార్డులు అందిస్తామన్నారు.

సమ్మక్కసారలమ్మ జాతర వేలం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 15: పాలవాగు ఒడ్డున ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన దుకాణాల వేలం పాటను గురువారం ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా పీఎం శ్యాంసుందర్, ఆర్కే ఓసీపీ పీవో గోవిందరావు ఆధ్వర్యంలో వెంకటేశ్వరాలయంలో నిర్వహించారు. చికెన్ షాపు రూ.75,500, మద్యం రూ.89,500, కొబ్బరికాయలు, పూజా సామగ్రి రూ.50,500, వాహన పార్కింగ్ రూ.1.33 లక్షలు, కూల్‌డ్రింక్స్, వాటర్, ఐస్‌క్రీం దుకాణాలకు రూ.75,500లకు వ్యాపారులు వేలం పాటలు గెల్చుకున్నారు. రూ.8 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. వేలం పాడుకున్న వారు ముందస్తుగా అడ్వాన్సులు చెల్లించారు. ఆర్కే 1ఏ గని అధికారి జయంత్ పాల్గొన్నారు. పట్టణంలో సమ్మక్క సార లమ్మలకు భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి బెల్లం తులాభారం చేయించుకున్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో 14మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఐజీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. మందమర్రి పీఎస్‌లో పని చేస్తున్న చంద్రకుమార్‌ను లక్సెట్టిపేట ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న లక్ష్మణ్‌ను వీఆర్‌లోకి, మందమర్రి-2 ఎస్‌ఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను మందమర్రి ఎస్‌హెచ్‌ఓగా, వీఆర్‌లో ఉన్న గుండేటి రాజీవ్‌వర్ధన్‌ను మంచిర్యాల 4వ ఎస్‌ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు

భీమిని, ఫిబ్రవరి 15 : బిట్టూరుపల్లికి చెందిన ఏటకారి బాపు కనపడడం లేదని కుటుంబ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. బాపు కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, ఫిబ్రవరి 15: పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మోడి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. సబ్జెక్టుల వారిగా వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట డీఈవో అశోక్, ఎస్‌వో మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో చేపట్టిన గ్రంథాలయభవన నిర్మాణ మిగులు పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో టీఎస్‌ఈడబ్ల్యూఐసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, గ్రంథాలయ శాఖాధికారులతో మిగిలిన పనులు, ఫర్నీచర్ ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి ఫర్నీచర్ ఏర్పాటు చేసి గ్రంథాల యాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో టీఎస్‌ఈడబ్ల్యూఐసీడీసీ ఈఈలు, డీఈలు, ఏఈలు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' అథ్లెటిక్స్ శిక్షకుడు


విద్యాసాగర్‌తో ఇండియన్ అథ్లెటిక్ చీఫ్ కోచ్ రాధాకృష్ణ, మలేషియన్ అంబాగ్ సభాని

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 15: ఆసిఫాబాద్‌లోని ఆదర్శ గిరిజన క్రీడాపాఠశాలలో అథ్లెటిక్ శిక్షకుడిగా విధులు నిర్వహి స్తున్న ఎం విద్యాసాగర్ కేరళలోని త్రివేంద్రంలో ఎల్‌ఎన్‌సీ పీఈలో ఈ నెల9నుంచి15వరకు నిర్వహించిన ప్రపంచ అథ్లెటిక్స్‌లెవల్-2 కోర్సులో అత్యంత ప్రతిభ కనబర్చి ఏ గ్రేడ్ అర్హతను సాధించి లెవల్-2కు ఎంపికైనట్లు గిరిజనక్రీడలఅధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, అసోసియేషన్ సభ్యులు సారంగపాణి తదితరులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కెరమెరి, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో కృష్ణారావు తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్ర నిర్వహణ, పౌష్టికాహారం అందిస్తున్న తీరును కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు.

కౌటాలలో కేజీబీవీ..

కౌటాల: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను హైదరాబాద్ డైరెక్టర్‌ఆఫ్‌స్కూల్ ఎడ్యూకేషన్ ఆదేశాలమేరకు ప్యానెల్‌టీం లీడర్ గావుడే హనుమంతు ఆధ్వర్యంలో సభ్యులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా అల్పాహారం, బోధన తీరును, తరగతి గదుల వాతావరణం, విద్యార్థినుల ప్రగతి, తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, స్వప్న, రాకేష్‌గుప్తా, రాజబాబు, సంతోష్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో వెడ్మ బొజ్జు ప్రసంగంపై సర్వత్రా హర్షం

జైనూర్, ఫిబ్రవరి 15: ఏజెన్సీప్రాంతంలో తరతరాలుగా సహవాసం చేస్తున్న గిరిజనేతరులకు బ్యాంకురుణాలు, పహా నీలు కల్పించాలని అసెంబ్లీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన ప్రస్తావనపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనేత రుల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గతంలో పాలించిన ప్రభుత్వాలు ఏజెన్సీలోని గిరిజనేతరులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతోవారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని గిరిజనేతరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడె నాగోరావ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనేతరుల బతుకు మనుగడ కోసం పహానీపత్రాలు, ఖరీఫ్‌రుణాలు మంజూరు అయ్యేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముక్‌వార్ నర్సింగ్, డాక్టర్ రామారావ్ ఘూటె పాల్గొన్నారు.

నివేదన



పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరిపురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టి... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామ లక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్మగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

● వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను ఆర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలన ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

- **ఫిబ్రవరి 21:** కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
- **ఫిబ్రవరి 22:** చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
- **ఫిబ్రవరి 23:** భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
- **ఫిబ్రవరి 24:** గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
- **ఫిబ్రవరి 28:** తిరుగువారం పండుగ.



● నూతి శివానందం

అవధూత శిఖామణి

మార్గదర్శి

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

విశేషం

జ్ఞాన కార్యసాధకుడు

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేనని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

● మధ్వ ప్రచార పరిషత్, 9440258841







మరో రెండు పథకాలకు కార్యాచరణ

- ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి, రూ.500కే సిలిండర్ అమలుకు కసరత్తు
- ఇప్పటికే గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది
- రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకునే అవకాశం
- జిల్లాలో 1.35 లక్షల విద్యుత్ కనెక్షన్లు, 1.42 లక్షల గ్యాస్ వినియోగదారులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 15: శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మరో రెండు పథకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు ఉచితవైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 15మండలాల పరిధిలో ఉన్న 335జీపీల పరిధిలో మరో రెండు పథకాలైన గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలుకు సర్వే జరుపుతున్నారు. ఈ పథకాల అమలు జరిగితే జిల్లాలోని ప్రజలకు మేలు జరుగనుంది.

జిల్లాలో విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు ఇలా..

జిల్లాలో 1.42లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉండగా, 1.29 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే 1,35,789 గృహవిద్యుత్ కనెక్షన్లు ఉండగా, ప్రతీనెల వినియోగదారులు విద్యుత్‌శాఖకు రూ.4.5కోట్ల మేర బిల్లులు చెల్లిస్తున్నారు. సాధారణంగా 200లోపు యూనిట్ల విద్యుత్‌వాడే వినియోగదారులకు యూనిట్‌కు రూ.5.25, 200 యూనిట్లపైన వాడే విద్యుత్ వినియోగదారులు రూ.6 చొప్పున చెల్లిస్తున్నారు. ప్రజా పాలనలో 200లోపు యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1,08,383 దరఖాస్తులు వచ్చాయి. ఇంటి యజమానులతోపాటు అద్దెకు ఉంటున్న వారికి సైతం ఈ పథకం అమలు చేయనున్నారు. దీంతో జిల్లాలో సుమారుగా 8కోట్ల మేర భారం పడనుంది.

రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకునే అవకాశం..

ఈ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసు కునే అవకాశాలున్నాయి. ప్రభుత్వం కూడా దీనినే ప్రాథమికంగా నిర్ణయించింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్ అందజేతకు రేషన్ కార్డు అవసరం ఉండంతో కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి రేషన్‌కార్డులు మంజూరుచేసిన తర్వాత ఇస్తారా? లేక పాతపద్ధతిలో పథకాలను వర్తింపజేస్తారా? అన్నది తెలియాల్సి ఉన్నది. అయితే కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేసి తద్వారా పథకాల అమలుచేస్తే బాగుంటుం దన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా విద్యుత్‌బిల్లులు ప్రతీ నెలా 1నుంచి 15వరకు బిల్లింగ్ ప్రక్రియ కొనసాగతోంది. గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొందేందుకు బిల్లు చెల్లించే వ్యక్తికి రేషన్ కార్డు, ఫోన్ నంబర్ లింకు, ఆధార్ కార్డు, మీటర్ సర్వీసు నంబర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదే శాలతో విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ అనుసంధానం చేసున్నారు. ఇంకా ఎవరైనా అనుసంధానం చేసుకోని వారు ఉంటే వెంటనే తమను సంప్రదించి వివరాలు ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే రూ.500లకే గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి ఏడాదికి 6 చొప్పున సిలిండర్ ఇచ్చే విధంగా డెలివరీ బాయ్ ద్వారా వివరాలు సేకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కేవైసీ తరహాలో లబ్ధిదారుల వివరాలతో పాటు, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్, రేషన్‌కార్డు నంబర్లను తీసుకుంటున్నారు. అయితే ఏ ప్రాతిపదికన లబ్దిదారులను ఎంపిక చేస్తారో పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. రేషన్ కార్డు ప్రామాణికమైతే కొత్తగా రేషన్‌కార్డు మంజూరు చేసి పథకాలను ఎంపిక చేయాలని మెజార్టీ ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో ఇంకా కొందరు విద్యుత్‌కనెక్షన్ల పూర్తివివరాలు అందించడం లేదు. అధికారులకు సహకరించాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరుతున్నారు.


వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖాధికారులు(ఫైల్)

ఎన్నికల్లో ప్రత్యేక బృందాల పాత్ర కీలకమైనది


మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో వీడియో, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాల పాత్ర కీలకమైనదని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారితోకలిసి వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, సహాయవ్యయపరిశీలకులకు ఏర్పాటుచేసిన శిక్షణకార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రత్యేకబృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృంద సభ్యులు ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు. చెక్‌పోస్టులవద్ద తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సరైన ఆధారాలులేని డబ్బులు, ఆభరణాలు, కానులను సీజ్‌చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో భద్రపరిచి పంచనామా పూర్తైన తరువాత అప్పగించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయపార్టీలు, అభ్యర్థులు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతర ప్రచార సంబంధిత అంశాలపై దృష్టిసారించి వీడియో చిత్రీకరించి వ్యయపరిశీలకులకు అందించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో కంట్రోల్‌రూం, సీవిజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా గిరిజనాభివృద్ధిఅధికారి రమాదేవి, వీడియోసర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ వివాదం నేపథ్యంలో దంపతుల హత్య

- కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య భూ తగాద
- తమ్ముడు, మరదలిని గొడ్డళ్లతో నరికిచంపిన అన్న, అతని పిల్లలు


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

వాంకిడి, ఫిబ్రవరి 15: అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా నెలకొన్న భూతగాదా గురువారం పంట చేనులోనే ఇద్దరి ప్రాణాలను బలికొంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన డెంగ్రె పత్రు, డెంగ్రె దస్సు ఇద్దరి అన్నదమ్ములు. వీరికి ఖమాన గ్రామానికి సమీపంలో పక్కపక్కనే భూములు ఉన్నాయి. కొంతకాలం క్రితం ఈ భూముల పంపకాల్లో వీరిమధ్య గొడవలు వచ్చాయి. దీంతో ఇరు కుటుంబాల మధ్య మాటలు లేవు. గురువారం సాయంత్రం డెంగ్రె దస్సు(52) అతడి భార్య డెంగ్రె బైనాబాయి (47) కూతురు సవిత చేనులో పత్తి తీస్తుండగా డెంగ్రె పత్రు అతని ఇద్దరు కూమారులు తిరుపతి, సాయి, కూతురు బయ్యా నలుగురు కలిసి దస్సు, అతడి భార్యపై గొడ్డళ్లతో దాడిచేసి నరికి చంపారు. అనంతరం నలుగురు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. ఎస్పీ సురేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. హత్యకుగల కారణాలకు మృతుల కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. హత్య చేసిన నలుగురిపైనా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్‌ను ఆదేశించారు.

జాతర దుకాణాల తైబజార్ వేలం

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 15: కాగజ్‌నగర్ మండలంలో ఈస్‌గాంలోని శ్రీ శివమల్లన్న ఆలయ ఆవరణలో నిర్వహించే జాతర దుకాణాల కోసం తైబజార్ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 8న మహా శివరాత్రి సందర్భంగా మార్చి7,8,9తేదీల్లో నిర్వహించే జాతర సందర్భంగా తైబజార్ నిర్వహణ టెండర్లు పొందేందుకు ఈనెల 20న ఉదయం 11గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు రూ.50వేలు నగదు డిపాజిట్ చెల్లించి, ఒక పాస్‌పోర్ట్ ఫొటో, చిరునామా ధ్రువీకరణపత్రం, ఆధార్‌లేదా రేషన్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు సమర్పించాలన్నారు. వివరాలకు 9866517353, 9618307962 నంబర్లలో సంప్రదించాలని ఈవో వివరించారు.

జన్వాడ దళిత క్రైస్తవులకు న్యాయం జరగాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 15: చేవెళ్ల జన్వాడ దళిత క్రైస్తవులకు న్యాయం జరగాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ నియోజకర్గ అధ్యక్షుడు యేసుకుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడారు. జన్వాడలో దళిత క్రైస్తవుల మీద బీజేపీ నాయకుల అండదండలతో మతోన్మాదులు రెచ్చిపోయి దాడిచేసినట్లు తెలిపారు. ఈ దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దాడికి పాల్పడిన వారిని శిక్షించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సామెల్ జాన్, రత్నాకర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

కౌటాల, ఫిబ్రవరి 15: యూఎస్పీసీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గయ్య, ప్రశాంత్, సఫల్,శ్యాం, పృథ్వీ, నగేష్,జ్ఞానేశ్వర్,ప్రవీణ్,జలపతి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

బెజ్జూరు, ఫిబ్రవరి 15: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత ఎఫ్‌బీవో మల్లికార్జున్, వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. వన్యప్రాణులకు ఎవరైనా హానికలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వేసవిలో అడవిలోకి వెళ్లేవారు అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో రమేష్, కృష్ణ, శంకర్, గోపాల్, తిరుపతి, మొండి, బాపు, రవి, భీమన్న, హనుమంతు, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశుధ్య కార్యక్రమాలు

బెజ్జూరు, ఫిబ్రవరి 15: మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో ఈనెల 7నుంచి 15వరకు నిర్వహించిన ప్రత్యేకపారిశుధ్య కార్యక్రమాలు ముగిశాయి. ఈ సందర్భంగా పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటుచేసి చేపట్టాల్సిన పనులపై తీర్మాణాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తహసీల్దార్ భూమేశ్వర్, ఉద్యానవనాధికారి వెంకటేశం, ఎంపీడీవో మాధవి, ఏవో రాజుల నాయుడు, ఏఈలు మక్బుల్, అభిలాష్, ఎంపీవో రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 15: మండలంలోని ఈజీఎస్, అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధిపనులలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

వాంకిడి, ఫిబ్రవరి 15: కేంద్ర కార్మికసంఘాలు, రైతు సంఘాలు శుక్రవారం తలపెట్టిన కార్మికసమ్మె, గ్రామీణబంద్‌ను మండలంలో విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజన్న కోరారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బంద్ చేపడుతున్నామని అన్నివర్గాల వారు మద్దతిచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దినకర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు గురువారం పంటల చుట్టూ కరెంటుతీగలు అమర్చడంవల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ మండలంలో అటవీ జంతువులను వేటాడడానికి, పంటకు రక్షణగా విద్యుత్‌తీగలు అమర్చితే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ వైర్లు పెట్టినట్లయితే ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్ (సీఐ-8712670506, ఎస్సై-8712670567)కు సమాచారం ఇవ్వాలన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 15: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావును గురువారం ఆయన నివాసంలో మున్నూరు కాపు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భవననిర్మాణానికి, రహదారి నిర్మాణానికి, విద్యుత్ సౌకర్యానికి నిధులు కేటాయించాలని విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే మంజూరునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు వెంకన్న, సురేష్, సతీష్ వెంకన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డీటీడీవో రమాదేవి

తిర్యాణి, ఫిబ్రవరి 15: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీటీడీవో రమాదేవి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో శానిటేషన్ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం వహిస్తేనే ఊరు అభివృద్ధి చెందుతుందన్నారు. ఈనెల 21,22,23తేదీల్లో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. జాతరలోప్లాస్టిక్ వాడిన వారికి జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

వాంకిడి/తిర్యాణి/లింగాపూర్, ఫిబ్రవరి 15: వాంకిడి ఎంపీవోగా జావీద్, తిర్యాణి తహసీల్దార్‌గా సునీల్‌కుమార్, ఎంపీడీవోగా మల్లేశం, లింగాపూర్ ఎంపీడీవోగా రామేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

పూలాజీబాబా ధ్యానమందిరంలో పూజలు

జైనూర్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోగల పట్నాపూర్ పరమహంస సద్గురు పూలాజీబాబా ధ్యానమందిరంలో గురువారం ఆదివాసీరాష్ట్ర మహిళాసభ్యురాలు ఆత్రం సుగుణక్క, మాజీసర్పంచ్ కనకప్రతిభ తదితరులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ సద్గురు పూలాజీబాబా ఆశీస్సులతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్టు ఆశిస్తున్నామని అన్నారు. తప్పకబాబా ఆశీర్వాదంతో ఎంపీ టికెట్టు కాంగ్రెస్ అధిష్ఠానం కట్టబెడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాబా తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్, కార్యదర్శి దుర్రె సుభాష్, విష్ణు ముకాడె పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సిర్పూర్(టి), ఫిబ్రవరి 15: సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులను గురువారం ఎంపీవో కృష్ణమూర్తి సన్మానించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి చేపట్టాల్సిన పనులను చర్చించారు. సమావేశంలో ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తాహెరాబేగం, మహేష్, ఇఫ్తుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలీసూ క్రమశిక్షణ కలిగి ఉండాలి: ఎస్పీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్


ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15: పోలీసు శాఖలో పనిచేసే ప్రతిఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. 15రోజులుగా జిల్లా పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో జరుగుతున్న జిల్లా ఆర్మ్‌డ్‌రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్మ్‌డ్‌సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. మూడు ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్‌కు అడ్మిన్ ఆర్‌ఐ పెద్దన్న ప్లటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. పదిహేను రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔట్‌డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబిలైజేషన్ ద్వారా శారీరక ధ్రుడత్వంతోపాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందన్నారు. అద్భుతంగా చేసిన పరేడ్‌ను చూస్తే తమశిక్షణ రోజులు గుర్తొస్తున్నాయని అన్నారు. ప్రజల ధన, మాన ప్రాణాలు కాపాడడం, శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుశాఖ ముఖ్య లక్ష్యమన్నారు. నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత కుటుంబపరమైన, శాఖపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటా మని వివరించారు. ఈ డి-మొబిలైజేషన్ పరేడ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, అడ్మిన్ ఆర్‌ఐ పెద్దన్న, ఎంటీవో ఆర్‌ఐ అంజన్న, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న

పోలీసు అధికారులకు సన్మానం..

జిల్లాలో పనిచేసి బదిలీపైవెళ్తున్న పోలీసు అధికారులను ఎస్పీ సురేష్‌కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీ అనేది సహజం అని అన్నారు. ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు జిల్లాలో ఎంతో కృషి చేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, జిల్లాలో వివిధముఖ్యమైన బందోబస్తులు విజయవంతంగా పూర్తిచేయడంలో ఎంతోకృషి చేశారన్నారు. మారుమూల ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తనకృషి అమ్యూలమైనదని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఉత్తమసేవలు అందించారన్నారు. అనంతరం బదిలీపైవెళ్తున్న ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీసీఆర్బీ డీఎస్పీ రమేష్, సూపరింటెండెంట్‌లు ఎండీ ఇంకేశవ అలీ,శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐ రాణాప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ..

ఆసిఫాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సదయ్య గురువారం ఎస్పీ సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న బంజార కులస్థులు

బెజ్జూరు, ఫిబ్రవవరి 15: మండలంలోని లంబాడీగూడ గ్రామంలో లంబాడీల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కేసునాయక్, చత్రునాయక్, సంతోష్, భిక్షపతి, తిరుపతి, విలాస్, కుమార్, గోపాల్, మంగిరాం, పెంటయ్య పాల్గొన్నారు.

కెరమెరి: మండలకేంద్రంలో సేవాలాల్ మహారాజ్ జయంతిని లంబాడాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి హోమం, భోగ్‌బండార్ నిర్వహించారు. కార్యక్రమంలో బంజారకులస్థులు శంకర్ నాయక్, వెంకట్‌రాం, శేషారావు, రాందాస్, శివాజీ పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తితో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, ఫిబ్రవరి 15: యువత క్రీడాస్ఫూర్తితో జీవిత లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నతస్థానాలు అధిరోహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలపరిధిలో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా ధ్రుడంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం గణపతి, ప్రవీణ్, ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా, మాజీ సర్పంచ్ రవి, శ్యాంరావు, రాంప్రసాద్, ఖ్వాజాబాయి, విజయనిర్మల, జ్యోతి, వెంకటేష్, జావీద్ పాల్గొన్నారు.


క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కార్మికులు విధులకు హాజరు కావాలి: ఐఎన్‌టీయూసీ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 15: సింగరేణి కార్మికులు తమ విధులకు హాజరు కావాలని ఐఎన్‌టీయూసీ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. పలుగనులపై గురువారం నిర్వహిం చిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సమ్మెలో పాల్గొనడం వల్ల సంస్థకు రూ.85కోట్లు, కార్మికులకు రూ.18కోట్లు నష్టం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కలవేన శ్యామ్, భీమ్‌రావు, గరిగె స్వామి, తిరుపతి రాజు, అన్ని గనుల పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మెకు బీఎంఎస్ దూరం..

ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు తమ యూనియన్ దూరంగా ఉంటుందని బీఎంఎస్ అధ్యక్షుడు, స్టాండరైషన్ కమిటీ సభ్యుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె డిమాండ్లు కార్మికుల జీతభత్యాలు, అలవెన్సులను హరించేవిధంగా ఉన్నాయని ఆరోపించారు. సింగరేణి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యం సాధనలో వెనబడి ఉన్నామని, దానిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, జీడి ప్రభాకర్, రాగం రాజేందర్, పాగిడి శ్రీకాంత్, పురుషోత్తమాచారి పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 15: రామకృష్ణాపూర్ పట్టణంలోని ఓసీపీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రాణహాని ఉన్నందున రక్షణచర్యలు తీసుకోవాలని గురువారం డీవైజీఎంకు ఐఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు దేవిభూమయ్య, పిట్ సెక్రెటరీ రమేష్ మాట్లాడుతూ ఓసీపీలో పనిచేస్తున్న పంప్ ఆపరేటర్లు, వివిధ డిసిగ్నేషన్‌లలో పనిచేస్తున్న కార్మికులు డీప్‌సైడ్, సౌత్‌సైడ్ పని చేస్తున్నప్పుడు అడవి జంతువులు సంచరిస్తుండడం, అదేవిధంగా కరెంటుకేబుల్స్, ఇనుపసామాగ్రి, ఇతరసామాగ్రి కొరకు దొంగలు ఆయుధాలతో సంచరిస్తూ కార్మికులపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇదివరకే కార్మికులు ఫిర్యాదు చేశారన్నారు. కానీ ఎలాంటి రక్షణచర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇది కార్మికుల ప్రాణాలతో చెలగాట మాడడమేనన్నారు. దీనివల్ల కార్మికులు భయభ్రాంతులకు గురై విధులకు రావడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, రాజేందర్ తెలిపారు. గురువారం ఆయా గనులు, డిపార్టుమెంట్ల వద్ద కార్మికులను కలిశారు. వారు మాట్లాడుతూ బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. దీన్ని తిప్పికొట్టాలన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిబిరం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 15: నిరుద్యోగులకు స్కిల్‌డెవలప్‌మెంట్ శిబిరం నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రాంతానికి చెందిన యువతీ, యువకులకు 8కోర్సుల్లో 20మందికి చొప్పున శిక్షణ ఇస్తామన్నారు. సోలార్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూవీలర్ టెక్నీషియన్, ఆర్క్‌అండ్‌గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్‌లో డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులకు డిగ్రీ/డిప్లొమా/ఐటిఐ/పదోతరగతి విద్యార్హత ఉండాలని, కాస్మటాలజీ (మహిళలకు) కోర్సుకు పదో తరగతి/ఎటువంటి విద్యార్హతలు లేకున్నా శిక్షణ ఇస్తామన్నారు.

18ఏళ్ల నుంచి 42ఏళ్ల వయస్సుగల యువతీ, యువకులు www.scclmines.com/apprenticeship వెబ్‌సైట్‌లో ఈనెల 16వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకొని, శ్రీరాంపూర్ వృత్తిశిక్షణకేంద్రంలో దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్స్‌ను అందించాలని సూచించారు.